

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## సుమంగళి

**భాష:** తెలుగు **కథ, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్, ఫోటోగ్రఫీ** - రామనాథ్ **దర్శకత్వం:** బి.ఎన్.రెడ్డి,
**పాటలు** - సముద్రాల రాఘవాచార్య; **సంగీతం** - నాగయ్య;
**నటీనటులు:** నాగయ్య, గిరి, కుమారి, మాలతి, లింగమూర్తి
**విడుదల:** 1940




చలన చిత్ర మాధ్యమాన్ని అధ్యయనం చేసే క్రమంలో బి.ఎన్.రెడ్డి. నిర్మించిన చిత్రాలు నేటికీ పాఠ్య పుస్తకాల్లాంటివే. ఆయన చిత్రాల్లో కనిపించే భావుకత, నిర్మాణ సరళిలో ఆవిష్కృతమయ్యే టెక్నిక్ నేటికీ నిత్యనూతనంగానే ఉంటాయి. ముఖ్యంగా ఆయన నిర్మించిన తొలిచిత్రాలు ఆయన దృక్పథాన్ని, ఆలోచనా రీతిని ప్రతిభావంతంగా మన ముందుంచుతాయి.

ఆయన తొలి చిత్రం 'వందేమాతరం' (1939) సామాజికాంశాన్ని, ఆనాటి రాజకీయాంశాన్ని చర్చిస్తే, రెండవ సినిమా 'సుమంగళి' (1940)లో స్త్రీ సమస్యని, విధవా సమస్యని ఇతివృత్తంగా స్వీకరించారాయన. ఏడు దశాబ్దాల క్రితం నిర్మితమయిన 'సుమంగళి' నేటికీ అనేక విషయాల్లో అన్వయం కలిగి ఉండడం దాని ప్రత్యేకత.

అయితే అప్పటికే తమిళంలో సుబ్రహ్మణ్యం 'బాలయోగిని' అనే చిత్రాన్ని నిర్మించాడు. తెలుగు, తమిళ భాషల్లో నిర్మితమైన బాలయోగినిలో నిజ జీవితంలో విధవరాలయిన ఓ బ్రాహ్మణ యువతి బాలయోగినిగా నటించింది. ఆ సినిమా ఫలితంగా స్వయంగా బ్రాహ్మణుడయిన సుబ్రహ్మణ్యంను ఆనాడే కులంనుంచి వెలివేశారు. అలాంటి సంఘటనల్ని గమనించి కూడా బి.ఎన్. తన రెండవ చిత్రంలోనే విధవా సమస్యని ఇతివృత్తంగా చేసుకుని సుమంగళి నిర్మించాడు. ఇతివృత్తాల్లోనే కాదు తన సినిమాల్లో నటీనటుల్ని కూడా కొత్తవాళ్ళనే తీసుకుని తన సినిమాలకి ఫ్రెష్‌నెస్‌ని అద్దారు. వందేమాతరం గొప్ప విజయాన్ని సాధించిన తర్వాత సుమంగళిలో హీరో నాగయ్యకు ముసలి పాత్ర నిచ్చి ప్రధాన భూమికకు కొత్తవాడయిన గిరిని తీసుకున్నాడు. సినిమా రంగంలో అది చాలా ధైర్యంతో కూడుకున్న వారితో చలన చిత్రాలు తీయడం సేఫ్టీ అనుకునే మనస్తత్వాలు కనిపించే మన తెలుగు సినీ రంగంలో బి.ఎన్ ఆనాడే ప్రయోగాలు చేశారు. ప్రయోజనాల్ని ముందుకు తెచ్చి సినిమాను ప్రతిభావంతమయిన మాధ్యమంగా నిరూపించే యత్నం చేశారు. భావుకులయిన వారు ఏ రంగంలో నైనా సరే తమ పనుల్ని నిలకడగా పూర్తిచేస్తారు. రిజల్టు పట్ల పర్‌ఫెక్షన్‌ని మాత్రమే ఆశిస్తారు. దానికి కాలాన్ని, డబ్బుని లెక్క చేయరు. బి.ఎన్. సరిగ్గా అలాంటి తత్వంతోనే సుమంగళి చిత్రాన్ని రాత్రులు షూట్ చేసి సంవత్సర కాలాన్ని తీసుకుని పూర్తిచేశారు.

లైటింగ్, కెమెరా మూవ్ మెంట్, పాత్రల్ని రూపుదిద్దిన తీరు సుమంగళి చిత్రానికి శాశ్వతత్వాన్ని కలిగించాయి. నవ్య చిత్రోద్యమం వేళ్ళూనక ముందే బిఎన్. సొంత గొంతుకతో నాటకీయతకు భిన్నంగా దృశ్యలయతో తన చిత్రాల్ని రూపొందించారు. ఆయన నిర్మాణ పద్ధతికి స్క్రిప్టులో రాసేవారమని బి.ఎన్. తానే స్వయంగా చెప్పుకున్నారు. అంతేకాదు నటీనటుల చేత నెలల కొద్ది రిహార్సల్స్ చేయించేవాడట బి.ఎన్. అందుకే ఆయన చిత్రాల్లో పరిపక్వత అంతలా సాధ్యమయింది.

'సుమంగళి' చితం "విధివిశాత్తు యవ్వనంలోనే మాంగల్యాని కోల్పోయి సామాజిక దూషణ చేత జీవచ్ఛవాల్లా బతుకుతున్న హిందూ స్త్రీల కోసం ఈ చిత్రం అంకితం" అన్న ఇంగ్లీషు మాటల్తో ప్రారంభమవుతుంది. నేపథ్యంలో నాగయ్య తెలుగు అనువాదాన్ని చదివినిపిస్తారు. చిత్రం గొప్ప ఆశావహంగా ఆరంభమయినప్పటికీ చిత్రం ముగింపులో విధవా వివాహాన్ని చూపించకుండానే ముగిస్తాడు. మళ్ళీ పెళ్ళిని చూపించక పోవడం ఓ పక్క నిరాశగా కనిపించినప్పటికీ పెళ్ళంటే స్త్రీ మరోసారి చట్రంలో ఇమిడినట్టేననే భావాన్ని కూడా అన్వయించు కోవచ్చునేమో. మొత్తమ్మీద అత్యంత కళాత్మకమయిన రీతిలో విధవా సమస్యని చిత్ర బద్ధం చేసిన సినిమా 'సుమంగళి' చిత్ర కథాంశం విషయానికి వస్తే ప్రగతి శీలమయిన భావాలు గలిగిన సత్యం ఐపిఎస్ పాసై తన ఇల్లు చేరుకుంటాడు. అతని కజిన్ పార్వతి సత్యంపై మమకారాన్ని పెంచుకుని ఆయనతో జీవితాన్ని పంచుకోవాలని తలపోస్తూ ఉంటుంది.

మరోవైపు ఆధునికురాలు, ధనవంతురాలు విద్యావంతురాలు అయిన సరస్వతి సత్యంని ఆకర్షిస్తుంది. సత్యం ఆమెతో ప్రేమలో పడతాడు. కాని సనాతనుడయిన సరస్వతి తండ్రి ఆమెకు చిన్నప్పుడే పెళ్ళిచేశాడని బాల్యవివాహమయిన కొద్దికాలానికి భర్త చనిపోయాడని సరస్వతికి తెలీదు. ఆ విషయాలేవీ ఆమెకు కనీసం స్ఫురణలో కూడా ఉండవు. ఆమె మనస్సును నొప్పించడం ఇష్టంలేక తండ్రి ఆమెకు చెప్పడు.

సత్యం సరస్వతిల మధ్య ప్రేమ చిగురించి ముందుకు సాగిన తర్వాత సరస్వతికి తనకు చిన్ననాడే వైధవ్యం ప్రాప్తించిందనే విషయం తెలుస్తుంది. ఆమె ఆశలన్నీ కూలిపోతాయి. సత్యంపై మనస్సున్న పార్వతి అతని మనసు తెలుసుకుని దుఃఖితురాలవుతుంది. సత్యం సరస్వతి కోసం వెళతాడు. కాని ఆమె సత్యం జీవితం నుంచి తొలిగిపోతుంది. చిత్రం చివర్లో పార్వతి చనిపోతుంది. సత్యం సరస్వతిలు కలుసుకుని ఒకటి అవకముందే చిత్రం ముగిసిపోతుంది.

సుమంగళి నిర్మాణం సమయానికే సంఘ సంస్కరణోద్యమాలు దేశ వ్యాప్తంగా జరుగుతుండేవి. ముఖ్యంగా మన ఆంధ్ర రాష్ట్రంలో కందుకూరి వీరేశలింగం నాయకత్వంలో సంస్కరణోద్యమం విస్తృతమయిన కాలమది. ఆయన రచనలు, ఉద్యమాలు బి.ఎన్‌పై

ప్రభావం చూపించి సుమంగళి నిర్మించేలా చేశాయి. చివరికి నాగయ్య చేత కందుకూరిని పోలిన పంతులు పాత్రని కూడా వేయించాడీ చిత్రంలో. పారిస్ నుంచి తెల్లటి విగ్గును తెప్పించి ముసలి పాత్రలో నాగయ్యని సజీవం చేశాడు బి.ఎన్.

సుమంగళి ఆర్ధికంగా విజయం సాధించకపోయినప్పటికీ విమర్శకుల చేత ఆనాడే విశేష ప్రశంసలు అందుకుంది. బాబూరావ్ పటేల్ ఈ చిత్రం చూశాక బి.ఎన్.రెడ్డిని పాల్‌ముని ఆఫ్ ఇండియా అని తన ఫిల్మ్ ఇండియా పత్రికలో ప్రశంసించారు. సుప్రద్ధ దర్శకుడు శాంతారాంతో సహా అనేక మంది సినీ ప్రముఖులు సుమంగళిని అందులోని చిత్రీకరణ పద్ధతిని విశేషంగా ప్రశంసించారు. సంగీత పరంగా కూడా సుమంగళి గొప్పగా ఉండి మన్ననలందుకుంది. 'ప్రేమమయమీ జీవనమూ', 'ఆడబ్రతుకే మధురం', 'బాలా పసుపు కుంకుమ నీకు', 'వస్తాడే మా బావ' లాంటి పాటలు ఆ కాలంలో విశేషంగా ప్రాచుర్యం పొందాయి.

మొత్తం మీద సుమంగళి అర్ధవంతమయిన సినిమాలకు తెలుగులో పాదులు వేసిందని చెప్పుకోవచ్చు. ఇన్ని గొప్పతనాలున్న సుమంగళి ప్రజల్నెందుకు ఆకర్షించలేక పోయిందనే విషయానికి వస్తే ఆ చిత్ర హీరో నలభై ఏళ్ళ తర్వాత రాండార్ గైతో చెప్పినట్టు "ఆ చిత్రం ప్రజల ఆలోచనల్ని తట్టింది కాని హృదయాన్ని తాకలేదేమో". బి.ఎన్.రెడ్డి మాటల్లోనే అన్వయించుకుంటే మధ్య తరగతి ప్రజలకీ చిత్రం ఇతి వృత్తపరంగానే నచ్చలేదేమో. విధవా పునర్వివాహ ఆలోచనకే ఆనాటి మధ్య తరగతి వ్యతిరేకంగా ఉన్న కారణంగానే చిత్రం ఆడలేదేమో.

ఇవన్నింటినీ మించి ఏ గొప్ప కళారూపానికైనా తాత్కాలిక ప్రయోజనాలు, విజయాలకంటే శాశ్వతమయిన గుర్తింపూ అన్వయమే ప్రధానం. ఆ గుర్తింపూ, అన్వయమూ సుమంగళికి నేటికీ ఉంది. అదొక మాస్టర్ పీస్.

✡✡✡

# దేవత

**కథ - స్క్రీన్‌ప్లే - ఫోటోగ్రఫీ** - రామనాథ్; **సంగీతం** - నాగయ్య;
**దర్శకత్వం** - బి.ఎన్.రెడ్డి; **విడుదల:** 1941
**నటీనటులు:** వి.నాగయ్య (వేణు), కుమారి (లక్ష్మి), బెజవాడ రాజరత్నం (విమల), నారాయణరావు (కవి)




**తెలుగు** సినిమాకి కళాత్మకత రుచి చూపించి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మన సినిమాకి స్థానం సంపాదించిన మహనీయ దర్శకుడు బి.ఎన్.రెడ్డి. ఆయన నిర్మించిన చిత్రాల సంఖ్య రెండు పదులు దాటకున్నా బి.ఎన్. సినిమాల సరళి మహోన్నతమయింది. తెలుగు సినిమా నిర్మాణ రీతిలో తొలి దశాబ్దాల్లో నాటకానికి కొనసాగింపుగా ఉండేది. నాటకీయ సంభాషణలు, వేషభాషలు మొదలైన అన్ని అంశాల్లో సినిమా నాటకాన్నే అనుసరిస్తూ ఉండేది.ఆ సరళికి భిన్నంగా బి.ఎన్. సినిమాటిక్ దృక్పథంతో. దృశ్యప్రధానమయిన చిత్రీకరణతో తన సినిమాల్ని పండించారు. నిర్మాణ పద్ధతుల్లోనే కాదు. ఇతివృత్తాలకు సంబంధించి కూడా బి.ఎన్ తెలుగు సినిమాని నేలమీదకి తెచ్చి నిలబెట్టాడు. సామాజిక

సమస్యల్ని, మానవీయ సంబంధాల్ని బి.ఎన్. తన చిత్రాల్లో చర్చించారు. సాంఘికమూ, జానపదమూ ఇలా ఏ చిత్రాన్ని నిర్మించినా బి.ఎన్. విషయం ఎన్నుకోవడంలోనూ, చిత్రీకరణలోనూ పరిపక్వతను సాధించేందుకు కృషి చేశారు.

అలాంటి బి.ఎన్.రెడ్డి 1941 ప్రాంతంలోనే ఆనాటి సామాజిక వాతావరణంలో ఎంతో ధైర్యంతో కూడుకున్న సినిమా నిర్మించారు. అప్పటికి సంఘంలో వేళ్ళూనుకుని ఉన్న భావజాలానికి, ఆ తరానికి భిన్నంగా వివాహానికి పూర్వం స్త్రీ పురుష సంబంధాలు, వివాహానికి ముందే తల్లయిన స్త్రీ సమస్యని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని బి.ఎన్. నిర్మించిన చిత్రం 'దేవత', పాశ్చాత్య సాహిత్య సంపర్కంతో, ఆధునికతను అందిపుచుకున్న దృక్పథంతో బి.ఎన్.రామనాథ్ తదితరుల విశేషకృషి ఫలితమే దేవత. ప్రముఖ ఛాయా చిత్రకారుడయిన రామనాథ్ చిత్రీకరణలోనూ, లైటింగ్ విధానంలోనూ చూపించిన మెళుకువ 'దేవత' చిత్రానికి ఎంతో వన్నె తెచ్చింది. వేణు (నాగయ్య) లండన్ నుంచి తిరిగి వచ్చిం తర్వాత తమ ఇంట్లో పనిచేసే కుమారిని (లక్ష్మి)ని లొంగదీసుకునే దృశ్యాన్ని ఎంతో సమ్యమనంతోనూ కళాత్మకతతోనూ చిత్రీకరించారు. ఆ తర్వాత తన తప్పును వేణు తల్లివద్ద అంగీకరించే దృశ్యాన్ని కూడా దర్శకుడి ఆలోచనా రీతికి రామనాథ్ కెమెరా, లైటింగ్‌లు ఎంతో గాంభీర్యాన్ని అద్దాయి. లండన్‌లో బారిష్టరీ చదువు ముగించుకుని వచ్చిన వేణు తమ ఇంట్లో పనిచేసే కుమారిని చెరచడం ఫలితంగా ఆమె గర్భవతి అయి, ఇంట్లోంచి వెళ్ళిపోయి సంఘంలో అనుభవించిన వ్యతిరేకత, పడ్డ కష్టాలు ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. చివరికి వేణు తన తప్పుని తెలుసుకుని కుమారిని, బిడ్డని చేరదీయడం 'దేవత' చిత్రానికి సంతోషకరమయిన ముగింపుని ఇస్తుంది. అయితే ఈ మధ్య తన తప్పులేని ఓ స్త్రీ ఒక పురుషుడి




అహంకారానికి కోరికకి బలయినప్పటికీ ఈ సంఘంలో ఎన్ని కష్టనష్టాల్ని అవమానాల్ని భరించాల్సివస్తుందో 'దేవత' చూపిస్తుంది. స్త్రీ, పురుష సంబంధాల్ని సాంఘిక పరిస్థితుల నేపథ్యంలో చర్చించి పురుషుడి ఆధిపత్యాన్ని ఎండగట్టి చివరికి వారిద్దరి కలయికతో చిత్రాన్ని ముగించడం ఆ నాటికి ధైర్యంతో కూడుకున్నదే ఇందులోనే మరో కోణంలో ధనికుడి కూతురు విమల ఓ బూటకపు కవి మాయలోపడి మోసపోవడమూ చూపిస్తాడు. బి.ఎన్. మొత్తానికి 'దేవత' స్త్రీ దృక్పథంతో నిర్మించబడినప్పటికీ స్త్రీ వ్యక్తిగత, మానసిక సమస్యని సంఘంలో ఎదురు నిల్చి వచ్చిన స్థితిని చాలా గొప్పగా డీల్ చేసింది. ఏడు దశాబ్దాల క్రితం నిర్మితమయిన 'దేవత' నిజాయితీ ఉన్న చిత్రం. గొప్ప విజయవంతమైన చిత్రం.

చిత్ర కథాంశం విషయానికి వస్తే వేణు ఇంగ్లాండులో న్యాయశాస్త్రం చదువుకుని స్వంత ఊరికి చేరుకుంటాడు. గొప్ప చదువుతోనూ, క్షేమంగానూ ఇల్లు చేరిన వేణుని చూసి ఆయన చెల్లి, తల్లి ఆనందిస్తారు. గర్వపడతారు. అప్పటికే వారి ఇంట్లో లక్ష్మి అనే అందమయిన పనిమనిషి పనిచేస్తూ ఉంటుంది. లక్ష్మి దాదాపుగా ఇంటి మనిషిలాగా వ్యవహరిస్తూ ఉంటుంది. అదే ఊర్లో ఓ ధనికుడు కూడా వేణు రాకకోసం ఎదురు చూస్తూ ఉంటాడు. తన కూతురు విమలను వేణుకిచ్చి పెళ్ళిచేయాలని ఆయన తలపోస్తూ ఉంటాడు. కాని ఆధునిక సమాజపు అత్యాధునిక లక్షణాల్ని స్మతరించుకుని ఫాషనబుల్‌గా ఉండే విమల తనదైన ప్రత్యేక జీవనసరళిని ఆచరిస్తూ ఉంటుంది.

వేణు ఇంగ్లాండ్ నుంచి వచ్చీ రాగానే తమ ఇంట్లో పనిచేస్తున్న అందమయిన లక్ష్మి వైపు ఆకర్షణ పెంచుకుంటాడు. కామంతో కళ్ళు మూతలు పడగా ఓ రోజు ఆమెను చెరుస్తాడు. ఆమెనుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయినా వేణు పశుబలంతో తన కోర్కెను తీర్చుకుంటాడు. ఫలితంగా లక్ష్మి గర్భవతి అవుతుంది. వేణు ఆమెకు కొంత డబ్బు ఇచ్చేందుకు ముందుకొస్తాడు. దిగ్భ్రాంతి చెందిన లక్ష్మి ఇల్లు విడిచి వెళ్ళిపోతుంది. ఆమె వెళ్ళిపోయిన తర్వాత వేణులో పశ్చాత్తాపం మొదలవుతుంది. తను చేసిన తప్పును గుర్తెరిగి బాధపడతాడు. ఇంతలో విమలతో వచ్చిన పెళ్ళి ప్రస్తావన నుంచి తప్పించుకు తిరుగుతాడు. విమల ఓ బూటకపు కవి సుకుమార్ మాయలోపడి పారిపోతుంది. ఇల్లు వదిలిపోయిన లక్ష్మి తన పాప, సోదరుడితో సహా తిండికోసం అల్లాడుతుంది. కుచ్చితమయిన లోకం ఆమెను స్థిరంగా ఉండనీయదు.

అక్కడ వేణు తను చేసిన తప్పుని తల్లివద్ద చెప్పి పశ్చాత్తాపపడతాడు. ఆమె లక్ష్మిని తన కోడలిగా చేసుకోవడానికి ముందుకు వస్తుంది. లక్ష్మిని వెతికి తీసుకురమ్మని వేణుకి చెబుతుంది. వేణు బయలుదేరతాడు. లక్ష్మి తన పాపకి భోజనం పెట్టేందుకు పనికోసం వెళితే ఓ మేడమ్ ఆమెను వ్యభిచార గృహానికి తీసుకెళుతుంది. విషయం అర్థమయిన లక్ష్మి, మేడమ్‌ని కొట్టి తప్పించుకుంటుంది. కాని పోలీసుల చేతుల్లో పడి జైలుపాలవుతుంది. ఆమె సోదరుడూ, పాప తిండికోసం బిచ్చమెత్తుకునే స్థితికి నెట్టబడతారు. లక్ష్మిని వెతికే క్రమంలో నగరానికి వచ్చిన వేణు తల్లి, చెల్లెలకు ఆ ఇద్దరూ తారసపడతారు. వేణుతో సహా అందరూ కలిసి లక్ష్మిని వెతుకుతారు. జైలులో ఆమెను కలుసుకుని వేణు లక్ష్మిని క్షమాపణ కోరతాడు. ఇల్లు చేరిన వాళ్ళంతా కలిసి జీవిస్తారు. ఇది టూకీగా కథ. ఇవ్వాళ్టికి ఆ కథ చాలా సాధారణంగానే అనిపించినా, తీసుకున్న కథాంశంలోనూ, చిత్రీకరణలోనూ ఆనాటి కాలంలో అది గొప్ప సినిమా.

చిత్రీకరణలో వేణు లక్ష్మిని చెరిచే దృశ్యం. అలాగే వేణు తన తల్లిదగ్గర పశ్చాత్తాప పడే దృశ్యం, వ్యభిచార గృహం సీను ఇంకా అనేక దృశ్యాలు చిత్రంలో గొప్ప లైటింగు, చిత్రీకరణ శైలితో అలరారుతాయి. ఇక మద్రాసు నగరాన్ని చిత్రబద్ధం చేసిన తీరు గొప్ప చరిత్రను రికార్డు చేసినట్లుంటుంది. ట్రాము, సెంట్రల్ స్టేషన్ ఇలా ఎన్నో అంశాలు వాస్తవికతను నింపుకొని చరిత్రలో మిగిలిపోతాయి.

వాణిజ్యపరంగా కూడా గొప్ప విజయాన్ని సాధించిన 'దేవత' తెలుగు చిత్రసీమలో ఆణిముత్యంలాంటి సినిమా. ఆనాడే స్త్రీ సమస్యని కళాత్మకతతో మేళవించి నిర్మించబడిన దేవత చిరస్థాయిని అందుకుంది.

✡✡✡